## క్లుప్తంగా

### నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ఏ.కొండూరు: మండలంలోని కేశ్యతండాలో గురువారం ఉదయం ఏడు గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ కాలసాని నాగలక్ష్మీ బుధవారం తెలిపారు. 14, 15 తేదీల్లో కృష్ణారావుపాలెంలో కూడా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కే రక్షణనిధి పాల్గొంటారని తెలిపారు.

### సీఆర్ఎం టీచర్ల బాధ్యతల స్వీకరణ

తిరువూరు: క్లస్టర్ రిజర్వు మొబైల్ టీచర్లుగా నియమితులైన వారు బుధవారం స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో స్కూల్ కాంప్లెక్సుల పరిధిలో పనిచేసే క్లస్టర్ రిసోర్స్ పర్సన్సను సీఆర్ఎం టీచర్లుగా మార్పుచేసి మండల విద్యాశాఖాధికారి ఆధీనంలో ఉండాలని విద్యాశాఖ ఆదేశించింది. మండలంలోని ఏదైనా పాఠశాలలో ఉపాధ్యాయులు సెలవుపై వెళితే వారి స్థానంలో ఈ సీఆర్ఎం టీచర్లు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. తిరువూరు మండలంలో ఆరుగురు సీఎంఆర్ టీచర్లు నియమితులయ్యారు.

### యోగా అనేది పురాతన సాంప్రదాయ విద్య

ఇబ్రహీంపట్నం: యోగా అనేది పురాతన సాంప్రదాయ విద్య అని శాంతివన్ ఫౌండేషన్ అధ్యక్షుడు, యోగా గురువు లంకే జనార్దన్ అన్నారు. స్థానిక ఏకాలనీ లోని ఎస్‌వీఎస్ కల్యాణ మండపంలో యోగా ఉచిత శిక్షణ తరగతులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా వలన శారీరక, మానసిక ప్రశాంత, సామాజిక స్పృహ ఏర్పడుతుందన్నారు.

### వీరాంజనేయస్వామి దేవస్థాన ఆదాయం రూ. 4.14 లక్షలు

మేడూరు(గంపలగూడెం): గంపలగూడెం మండలం మేడూరు వీరాంజనేయస్వామి ఆలయంలో భక్తులు హుండీలలో వేసిన నగదును బుధవారం అధికారులు లెక్కించారు. గడచిన మూడు నెలల 15 రోజులుగా భక్తులు హుండీలలో వేసిన కానుకలు రూ 4,14,400ను లెక్కింపులో వచ్చినట్లు ఆలయ మేనేజర్ వెంకటేశ్వర రావు తెలిపారు. గన్నవరం ఇన్‌స్పెక్టర్ వి. సుధాకర్ పర్యవేక్షణలో సిబ్బంది కానుకలను లెక్కించారు. ఆలయ కమిటీ చైర్మన్ ముత్యాల రామకృష్ణ, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

### 2,970 కిలోల బెల్లం స్వాధీనం

తిరువూరు: తిరువూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు బుధవారం సారా తయారీకి ఉపయోగించే బెల్లాన్ని విస్సన్నపేట మండలం చంద్రుపట్ల తండాలో స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఈబీ సీఐ గురవయ్య కథనం మేరకు ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చిత్తపూరుకు చెందిన సాదం సురేష్, విస్సన్నపేటకు చెందిన పానుగంటి గిరిబాబు పశ్చిమగోదావరి జిల్లా నుంచి పెద్ద ఎత్తున తెచ్చి నిల్వ చేసినట్లు సమాచారం అందుకుని దాడి చేశారు. చంద్రుపట్లలో 2,970 కిలోల బెల్లం లభ్యమైంది. చంద్రుపట్ల తండాలో బెల్లం రవాణాకు వినియోగిస్తున్న బొలెరో వాహనాన్ని కూడా స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. సారా తయారీదారులకు ఈ బెల్లాన్ని విక్రయిస్తున్న విస్సన్నపేటకు చెందిన మాచినేని అరవింద్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తిరువూరు ఎస్ఈబీ ఎస్సై వెంకటలక్ష్మి, సిబ్బంది ఈ దాడిలో పాల్గొన్నారు.

### డిజిటల్ బోధనపై శిక్షణ

తిరువూరు: స్థానిక శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు డిజిటల్ తరగతి బోధనపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. తిరువూరు ఎంఈఓ-2 రామకృష్ణ పర్యవేక్షణలో గంపలగూడెం, విస్సన్నపేట మండలాల ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. విద్యార్థికి సులభరీతిలో అర్థమయ్యే రీతిలో పాఠ్యాంశాల బోధన, డిజిటల్ తరగతి గదుల్లో ఉపాధ్యాయుడి బాధ్యతలు తదితర అంశాలపై ఈ శిక్షణ కొనసాగింది.

### పశువులకు గురక వ్యాధి నివారణ వ్యాక్సిన్

నెమలి/గుళ్లపూడి(గంపలగూడెం): పశువుల్లో సీజనల్గా వ్యాపించే గురక వ్యాధి నివారణకు మండలంలోని రెండు గ్రామాల్లో పశు సంవర్థక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉచితంగా వ్యాక్సిన్ వేశారు. పశువైద్యాధికారి అభిలాష్ పర్యవేక్షణలో సిబ్బంది ఆయా గ్రామాలలో పశువులకు వ్యాక్సిన్ చేశారు. నెమలిలో 150, గుళ్లపూడిలో 160 పశువులకు వ్యాక్సిన్ వేసినట్లు అభిలాష్ తెలిపారు. ఉమ్మడి దేవరపల్లి, అనుముల్లంక గ్రామాల్లో పశువులకు గురువారం వ్యాక్సిన్ వేస్తామని పేర్కొన్నారు.

### పోతురెడ్డిపల్లిలో వైస్‌చాన్సలర్ టు విలేజ్ కార్యక్రమం

నూజివీడు: మన గ్రామం-మన విశ్వవిద్యాలయంలో భాగంగా వైస్ చాన్సలర్ టు విలేజ్‌లో నూజివీడులోని మామిడి పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు మండలంలోని పోతిరెడ్డిపల్లిని 2023-24 ఏడాదికి దత్తత తీసుకున్నారు. ఇందులో భాగంగా పోతురెడ్డిపల్లిలో శాస్త్రవేత్తలు బుధవారం గ్రామంలో గ్రామసభను నిర్వహించారు. రైతులు ఎదుర్కొనే ఇబ్బందులు, పంటలను ఆశించే పురుగులు, తెగుళ్లు, వివిధ పంటలలో ఎరువుల యాజమాన్యం, డ్వాక్రా సంఘాల అభివృద్ధి, అంగన్‌వాడీ కేంద్రాల కార్యక్రమాలు, ఆర్గానిక్ ఫార్మింగ్, వివిధ ఉద్యాన పంటలైన పూలు, కూరగాయలు, పండ్లు, సుగంధ ద్రవ్యాలు తదితర వాటి విశిష్టతలపై రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు.


# వెల్ నైస్

- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు తీరిన తిప్పలు
- గ్రామీణ ప్రజలకు సత్వర వైద్యం
- వెల్‌నెస్ సెంటర్లలో అన్ని వ్యాధులకూ మందులు



తిరువూరు మండలంలో వ్యాధిగ్రస్తుడి ఇంటివద్దకే వైద్యురాలు (ఫైల్)

తిరువూరు: అత్యవసర వైద్యం అందక మృత్యువాత పడే గ్రామీణ ప్రాంత ప్రజలకు చేరువలో వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటవడంతో వైద్యసేవల్లో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి. ఇంటివద్దకే వైద్యులు వచ్చి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సత్వర సేవలందిస్తుండటంతో పేదల పాట్లు తప్పాయి. తిరువూరు మండలంలో 20 గ్రామాలుండగా 17 సచివాలయాల పరిధిలో వెల్‌నెస్ సెంటర్లను నిర్వహిస్తున్నారు. చౌటపల్లి, రాజుగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్యుల పర్యవేక్షణలో నిత్యం ఔట్‌పేషెంట్లకు వైద్యపరీక్షలు నిర్వహించడం, ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలకు వచ్చే జలుబు, దగ్గు, జ్వరం తదితర సమస్యలకు అక్కడే చికిత్స చేసి మందులు అందజేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఎత్తుకు, వయసుకు తగ్గ బరువు ఉండే విధంగా తల్లులు, అంగన్‌వాడీ కార్యకర్తలకు వెల్‌నెస్ సెంటర్ ఆరోగ్య కార్యదర్శులు సూచనలు ఇస్తున్నారు. అసంక్రమణ వ్యాధుల గుర్తింపు సర్వే, సీజనల్‌వ్యాధుల సర్వే, గర్భిణులకు, చిన్నపిల్లలకు రోగనిరోధక టీకాలు వేయడం, పోలియో, ఎయిడ్స్ వ్యాధుల నిర్మూలన, మహిళలు గర్భందాల్చిన నాటి నుంచి క్రమం తప్పక వైద్యపరీక్షలు చేయించి ప్రభుత్వాస్పత్రుల్లో సుఖ ప్రసవం జరిగే విధంగా వెల్‌నెస్ సెంటర్స్ ఆరోగ్య కార్యదర్శులు, ఆశావర్కర్లు కృషి చేస్తున్నారు.




**600 మందికి ప్రత్యేక వైద్యసేవలు**

తిరువూరు మండలంలోని గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్యసేవల కోసం పెద్దాస్పత్రికి వెళ్లే అవసరం లేకుండా వెల్‌నెస్ సెంటర్లు అందుబాటులోకి వచ్చాయి. వీటికి నిర్మిస్తున్న పక్కా భవనాలు సైతం పూర్తి కావచ్చాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు ప్రతి గ్రామంలోనూ నెలకు ఒకసారి ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ఏర్పాటు చేసి, ప్రత్యేక వాహనంలో అన్ని రకాల మందులతో సహా క్యాంపు నిర్వహిస్తున్నారు. రక్తపోటు, మధుమేహం, క్షయ, రక్తహీనత, కుష్ఠు తదితర వ్యాధిగ్రస్తులు మండలంలో 600 మందిని గుర్తించిన వైద్యులు వారికి ప్రత్యేక వైద్యసేవలందిస్తున్నారు. కోవిడ్ తర్వాత నెలకొన్న పరిణామాల నేపథ్యంలో కుష్ఠు, క్షయ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతుండటంతో వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించి వైద్యం అందిస్తున్నారు.

### ఇప్పుడు సంతోషంగా ఉంది



మధుమేహం, రక్తపోటు వ్యాధితో బాధపడుతున్న నా వంటి వారికి ఇంటి వద్దకే డాక్టర్ కార్యక్రమం చాలా ప్రయోజనకరంగా ఉంది. గతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికో, ప్రైవేటు ఆస్పత్రికో వెళ్లాలంటే ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు ఎవరిపైనా ఆధారపడకుండా డాక్టరే ఇంటి వద్దకు వచ్చి వైద్యం అందిస్తున్నందుకు సంతోషంగా ఉంది.

– కందిమళ్ల సంధ్యావేణి, మల్లేల

### పేదల బాధలు గుర్తించారు



డబ్బులు లేక, వైద్యం అందక తీవ్ర ఇబ్బంది పడే మా వంటి పేదల బాధలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గుర్తించి మా ఇంటి వద్దకే వైద్యులను పంపుతున్నందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాం. మా ఊరికే వైద్యులు రావడం చరిత్రలో ఇంతవరకు ఎప్పుడూ లేదు. మందులు కూడా ఉచితంగా అందిస్తూ, ఎప్పుడు కోరితే అప్పుడు ఆరోగ్య కార్యకర్తలు వచ్చి వైద్యపరీక్షలు చేస్తున్నారు.

– గుంజి నాగమణి, మల్లేల

### ఫ్యామిలీ ఫిజీషియన్‌తో సత్వర సేవలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుంది. ప్రతి నెలా తప్పనిసరిగా ఒక గ్రామంలో వైద్యులు వెళ్లి రోగుల ఇంటివద్దే వైద్యసేవలు అందించే విధంగా ఈ కార్యక్రమం రూపొందించారు. వృద్ధులు, మంచంలో ఉన్నవారు, దివ్యాంగులకు ఈ కార్యక్రమం చాలా ఉపయోగకరం.

– కల్యాణ్ చక్రవర్తి, వైద్యాధికారి, పీహెచ్‌సీ, చౌటపల్లి

## పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై వలంటీర్ల నిరసన



రెడ్డిగూడెంలో వలంటీర్ల నిరసన ప్రదర్శన



పుట్రేల సెంటర్లో పవన్ కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న వలంటీర్లు

రెడ్డిగూడెం: వలంటీర్లను సంఘ విద్రోహశక్తులుగా అభివర్ణిస్తూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా వలంటీర్లు రెడ్డిగూడెం ప్రధాన కూడలిలో బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. స్థానిక సచివాలయం నుంచి రెడ్డిగూడెం ప్రధాన కూడలి వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పవన్ కల్యాణ్ తన వ్యాఖ్యలను ఉపసంహరించుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ పాల్‌కు, ఎస్సై శ్రీనుకు వినతి పత్రం అందజేశారు.

**పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మ దహనం**

పుట్రేల (విస్సన్నపేట): వలంటీర్లపై పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వాఖ్యలకు నిరసనగా మండలంలోని పుట్రేల 1,2 సచివాలయాల పరిధి వలంటీర్లు నిరసన ప్రదర్శన నిర్వహించారు. పవన్‌కల్యాణ్ దిష్టిబొమ్మను బుధవారం దహనం చేసారు. వలంటీర్లకు పవన్‌కల్యాణ్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ పరమావధి



కృష్ణవరంలో సర్టిఫికెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి(నూజివీడు): ప్రజాసంక్షేమమే ప్రభుత్వ పరమావధని ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు అన్నారు. కృష్ణవరంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రతాప్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 656 మందికి ఎమ్మెల్యే చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి వైద్యఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.10 లక్షలకు సంబంధించిన ఎల్‌ఓసీని లబ్ధిదారుడు తొందూరి ప్రసాద్‌కు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థను, వలంటీర్లను నియమించి ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, వైస్ ఎంపీపీ రమేష్, స్పెషల్ ఆఫీసర్ వెంకటరత్నం, తహసీల్దార్ ఉదయభాస్కర్, ఎంపీడీఓ శంకర్‌రావు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి(నూజివీడు): సంక్షేమంతో పాటు అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు అన్నారు. మండలంలోని కృష్ణవరంలో అంగన్‌వాడీ బిల్డింగ్ నిర్మాణానికి, కమ్యూనిటీ హాల్, వాటర్ ట్యాంకు నిర్మాణాలకు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు శంకుస్థాపన చేయడంతో పాటు జలజీవన్ పథకం కింద ఇంటింటికీ కుళాయి పథకాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, వైస్ ఎంపీపీ రమేష్, సర్పంచిలు జ్యోతి, కేఎస్ఎస్ దిలీప్, ఎంపీడీఓ పీ శంకరరావు పాల్గొన్నారు.

### సీడ్ లైసెన్స్ తప్పక పొందాలి

గంపలగూడెం: మిరప నర్సరీలను ఏర్పాటు చేస్తున్న యాజమాన్యం కలెక్టర్ ఢిల్లీరావు ఆదేశానుసారం తప్పకుండా సీడ్ లైసెన్స్ పొందాలని వ్యవసాయ అధికారి బి.సాయిశ్రీ, ఉద్యానవన శాఖ అధికారి సోహెల్ అహ్మద్ తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖల సంయుక్త ఆధ్వర్యంలో గంపలగూడెం మండలం ఉటుకూరు, కొణిజెర్ల, దుందిరాలపాడు గ్రామాల్లో మిరప షెడ్ నెట్ నర్సరీలను అధికారులు తనిఖీ చేశారు. నర్సరీల యాజమాన్యానికి పలు సూచనలు ఇచ్చారు. వీఏఏలు నరహరి, కార్తీక్, వీహెచ్ఏ సదాశివరావు పాల్గొన్నారు.

### అమ్మవారికి ఆషాఢ సారె

విస్సన్నపేట: మండలంలోని పుట్రేల మారెమ్మ దేవస్థానంలో అమ్మవారికి ఆషాడ సారెను వాసవీక్లబ్, వాసవీవనితా క్లబ్‌ల ఆధ్వర్యంలో బుధవారం సమర్పించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కోటగిరి వెంకట సత్యశేష సునీల్‌కుమార్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్రేల, కోటిపల్లి, నూతిపాడు, సత్తెనగూడెం, తెల్లదేవరపల్లి వాసవీ వనితా క్లబ్ మహిళలు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

### ఆరోగ్య పరిరక్షణ అవసరం

మైలవరం: ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరిరక్షణ అవసరమని మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మేజర్ మన్నే స్వామి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి సూచనల మేరకు కళాశాల యూత్ రెడ్ క్రాస్ వలంటీర్స్ మైలవరం, వెల్వడం, గణపవరం గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు స్నానపు సబ్బులు, బట్టల సబ్బులు పంపిణీ చేశారు. 20మంది కళాశాల యూత్ రెడ్ క్రాస్ వలంటీర్స్, ఫిజికల్ డైరెక్టర్ మేజర్ మన్నే స్వామి పాల్గొన్నారు.

### రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు

చాట్రాయి: రాజకీయాలకతీతంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని ఏపీ కో ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి తెలిపారు. మండలంలోని మర్లపాలెంలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో ఆయన మాట్లాడారు. అర్హత ఉండి ఏ సంక్షేమ పథకం అందని వారు తగిన ఆధారాలు సమర్పిస్తే పథకం మంజూరు చేయిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దుర్గాప్రసాదు, తహసీల్దార్ విశ్వనాథరావు, మండల ప్రత్యేక అధికారి నెహ్రూబాబు పాల్గొన్నారు.

### నృత్య పోటీల్లో విద్యార్థినుల ప్రతిభ

కొండపల్లి(ఇబ్రహీంపట్నం):జాతీయ స్థాయి జానపద, శాస్త్రీయ నృత్య పోటీల్లో కొండపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ప్రతిభ చాటారు. నాట్య రవళి మ్యూజిక్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో ఈ నెల 8వ తేదీ నుంచి మూడు రోజుల జరిగిన కూచిపూడి నృత్యంలో సంపనాల శ్రావ్య సబ్ జూనియర్ విభాగం, జూనియర్ విభాగంలో వి.సాధనసూర్య తృతీయ స్థానంలో నిలిచారు. బుధవారం పాఠశాల హెచ్ఎం బి.పద్మలత, ఉపాధ్యాయులు బాలికలను అభినందించారు.

### దివ్యాంగులకు ఉపకరణాలు అందజేత

రెడ్డిగూడెం: మండల భవిత సెంటర్ సమగ్ర శిక్షణ్ ఆధ్వర్యంలో స్వర్ణ టోల్‌ప్లాజా కేసర వారి సహకారంతో దివ్యాంగులకు ఉపకరణాలను బుధవారం అందజేసినట్లు ఫిజియోథెరపీ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో మండల ఐఈఆర్టీ ఎస్కే జాన్‌బి పాల్గొన్నారు.

## అర్హులకు పథకాలు అందజేయడమే ధ్యేయం

**ఎమ్మెల్యే వెంకట ప్రతాప్ అప్పారావు**



గుళ్లపూడిలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ముసునూరు: అర్హులైన ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చడమే జగనన్న సురక్ష కార్యక్రమ ధ్యేయమని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పేర్కొన్నారు. జగనన్న సురక్ష మండల ప్రత్యేకాధికారి, నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ దాసరి సుధ అధ్యక్షతన బుధవారం గుళ్లపూడిలో జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 572 ధ్రువ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ నూతన భవనాన్ని ప్రారంభించారు. జగనన్న సురక్ష గ్రామ శిబిరం గుర్తుగా ప్రాంగణంలో అధికారులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆర్.కృష్ణకుమారి, వైస్ ఎంపీపీలు రాజా నాయన, గంగాధర్, జెడ్పీటీసీ సభ్యుడు డా.వరికూటి ప్రతాప్, సర్పంచ్ ఆర్ శ్రీదేవి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగవల్లేశ్వరరావు, ఎంపీడీఓ జి.రాణి పాల్గొన్నారు.

### మోడల్ విలేజ్ పనుల పరిశీలన

జూపూడి(ఇబ్రహీంపట్నం): జూపూడిలో కేంద్ర ప్రభుత్వ సాలిడ్ లిక్విడ్ మేనేజ్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, గ్రీనరీ పనులను డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జెడ్పీ వైస్ చైర్మన్ గరికపాటి శ్రీదేవి, ఎంపీపీ పాలడుగు జోత్స్న ప్రజాప్రతినిధులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఆ సంస్థ కన్సల్‌టెంట్ శ్రీనివాసన్ గ్రామంలో డ్రైన్లు, రోడ్ల పక్కన చేపట్టనున్న గ్రీనరీ పనులు వారికి వివరించారు. రాష్ట్రానికి రోల్ మోడల్‌గా గ్రామాన్ని తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. తొలుత ఎంపీపీ పాఠశాల ప్రాంగణం, పరిసర రోడ్లు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపీడీఓ రామకృష్ణనాయక్, వైస్ ఎంపీపీ బాణావత్ నాగబాలమ్మ పాల్గొన్నారు.

### హెల్త్ క్లినిక్ తనిఖీ

జి.కొండూరు: మండల పరిధి హెచ్ ముత్యాలంపాడు హెల్త్ క్లినిక్‌ను జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.సుహాసిని బుధవారం తనిఖీ చేశారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. అదేవిధంగా ఓపీ రిజిస్టర్, మందులు, రక్త పరీక్షల రికార్డులను పరిశీలించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆమె చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలను సమీక్షించారు. కార్యక్రమంలో వెలగలేరు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ రవికాంత్ పాల్గొన్నారు.

### పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



రెడ్డిగూడెం: మండలంలోని ముచ్చనపల్లి గ్రామ పరిధిలో పయనీర్ కంపెనీ మొక్కజొన్న పీ3396 రకం విత్తనాలపై రైతులు వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేయడంతో బుధవారం యూనివర్సిటీ శాస్త్రవేత్తల బృందం, వ్యవసాయాధికారులు ఆయా పొలాలను పరిశీలించారు. గింజలు లేకుండా కండెలు రావటానికి గల కారణాలపై అధ్యయనం చేశారు. త్వరలో రిపోర్ట్‌ను జిల్లా వ్యవసాయాధికారికి పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు జీ. నగేష్, ఐ.సుధీర్‌బాబు, డా. వై పుష్పరేణి, మండల వ్యవసాయాధికారి సురేష్ పాల్గొన్నారు.

### ఐటీఐలో చేరేందుకు దరఖాస్తు చేసుకోండి

నూజివీడు: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో పలు ట్రేడుల్లో ఖాళీల్లో ప్రవేశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దేవరకొండ భూషణం బుధవారం తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఈనెల 31వ తేదీ సాయంత్రం 5గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.